సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025

‘టెలీ మానస్’తో ఊరట..

ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండగా విద్యార్థుల్లో భయం తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ‘టెలీమానస్’ను అందుబాటులోకి తెచ్చింది. 8లో



..పెన్షన్ ఫండ్ బలోపేతం

సింగరేణి కార్మికులు ఉద్యోగ విరమణ అనంతరం ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి ‘సీఎంపీఎఫ్’ కీలక నిర్ణయం తీసుకుంది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 18°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం కూడా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో సరస్వతీ దేవికి పూజలు



సరస్వతీదేవి సన్నిధిలో చిన్నారులతో తల్లిదండ్రులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువు దీరిన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీ దేవికి పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ సముదాయంలో ఉన్న సరస్వతిదేవి అమ్మవారి సన్నిధిలో అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, ఆరేళ్ల లోపు వయసగల 20 మంది చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది క్రీడల్లో రాణించాలి

- ఎస్పీ రోహిత్‌రాజ్



పతకాలు సాధించిన పోలీసులతో ఎస్పీ

కొత్తగూడెంటౌన్: పోలీస్ సిబ్బంది క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించిన జిల్లా పోలీసులను సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తి చాటాలన్నారు. కాగా, ఈ పోటీల్లో ఏఆర్ కానిస్టేబుల్ వంశీకృష్ణ 100 మీటర్ల విభాగంలో, యోగాలో కొత్తగూడెం త్రీటౌన్ కానిస్టేబుల్ రత్నకుమారి బంగారు పతకాలు సాధించారు. మరొకరు రజిత, ఎనిమిది మంది కాంస్య పతకాలు సాధించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం



కొత్తగూడెంలోని ఓ సెంటర్‌లో ప్రాక్టికల్స్‌ను పరీక్షిస్తున్న నోడల్ అధికారి

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలోని 54 కేంద్రాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు పలు సెంటర్లలో తనిఖీ చేశారు. పరీక్షలు ఈనెల 22వ తేదీ వరకు జరుగుతాయని, ఈ ఏడాది సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

నేటి నుంచి అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు

భద్రాచలంటౌన్ : భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, గుంటూరుకు చెందిన కళాకారులు నాటికలు ప్రదర్శించనున్నారు. ఉమ్మడి జిల్లా కళాకారులచే ‘జానపద హంగామా’ ప్రముఖ మిమిక్రీ కళాకారుడు రమేష్ ప్రదర్శనతో పాటు పలు శాస్త్రీయ, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



పాల్వంచ స్టేడియంలో ఆధునిక టెన్నిస్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

టాలెంట్ ఫుల్.. వసతులు నిల్..

విమెన్ వరల్డ్ కప్ (అండర్ 19)లో భారత్ గెలిచింది. ఈ టోర్నమెంట్‌లో భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు గెలుచుకోవడంతో జిల్లా యావత్తు సంబరాలు చేసుకుంది. ఒక్క క్రికెట్‌లోనే కాదు.. అథ్లెటిక్స్, ఆర్చరీ, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లోనూ జిల్లాకు చెందిన వారు రాణిస్తున్నారు. అయితే మౌలిక సదుపాయాల కొరత, కోచ్‌లు లేకపోవడం వంటి కారణాలతో చాలా మంది ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

క్రీడారంగంలో రాణిస్తున్న జిల్లా వాసులు

- క్రీడాకారులను వేధిస్తున్న మౌలిక సదుపాయాల కొరత
- శిక్షణ కోసం నగరాలకు వలస బాట
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని మినీ స్టేడియాలు

ఓవరాల్ చాంపియన్..

జిల్లాలో క్రీడా రంగంలో ఎంతో ప్రతిభ కలిగిన వారు ఉన్నారు అనడానికి ఇటీవలి సీఎం కప్ పోటీలే ఉదాహరణ. గత డిసెంబర్‌లో జరిగిన ఈ పోటీల్లో 53 పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా భద్రాద్రి జిల్లా నిలిచింది. ముఖ్యంగా అథ్లెటిక్స్ విభాగంలో వచ్చిన 28 పతకాలు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కేందుకు దోహదం చేశాయి. పాయింట్ల పట్టికలో పాత ఉమ్మడి జిల్లా కేంద్రాలను వెనక్కునెడుతూ 33 జిల్లాల్లో ఏడో స్థానంలో మన క్రీడాకారులు నిలిచారు. వారికి గల సహజ సిద్ధ ప్రతిభ కారణంగా అథ్లెటిక్స్, ఆర్చరీ, వాలీబాల్, కబడ్డీ, బాక్సింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ రంగాల్లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నారు. అయితే జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా క్రీడాకారుల్లో ప్రతిభను సానబెట్టే, పదును బెట్టే పరిస్థితులు ఇక్కడ లేకపోవడం పెద్ద లోటుగా మారింది.

ఇక్కడ వసతులు లేక..

గుండాలకు చెందిన కొండపల్లి చందన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి త్వరలో మలేషియాలో జరిగే ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు ఎంపికైంది. జిల్లాకు చెందిన చందన వరంగల్‌లో ఉంటూ కరాటే కోచింగ్ తీసుకుంటూ క్రీడల్లో ముందుకు సాగుతోంది. భద్రాచలం ఏజెన్సీకి చెందిన మోడెం వంశీ గత ఆగస్టులో జర్మనీలో జరిగిన అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. స్థానికంగా వెయిట్ లిఫ్టింగ్ సాధనకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో జిల్లాను వీడి హైదరాబాద్ చేరుకుని పార్ట్‌టైం జాబ్ చేస్తూ అక్కడ ఎల్‌బీ స్టేడియంలో సాధన చేస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ఇల్లెందుకు చెందిన ఖాజాపాషా బాడీ బిల్డింగ్‌లో జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. కానీ స్థానికంగా పరిస్థితులు అనుకూలంగా లేక హన్మకొండ కేంద్రంగా సాధన చేస్తున్నాడు. ఇలా ఎందరో క్రీడాకారులు స్థానికంగా మౌలిక వసతుల కొరత, కోచ్‌లు లేకపోవడం వంటి కారణాలతో రాష్ట్ర రాజధాని లేదంటే వరంగల్, ఖమ్మం వంటి నగరాలపై ఆధారపడాల్సి వస్తోంది.

సింగరేణి, కాలేజీ మైదానాలే దిక్కు..

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరులో ఉన్న స్టేడియాలు క్రీడాకారులకు ఆలంబనగా నిలిచాయి. అలాగే భద్రాచలం జూనియర్ కళాశాల, శ్రీరామచంద్ర డిగ్రీ కాలేజీ వంటి విద్యా సంస్థలకు చెందిన మైదానాలు క్రీడాకారులను అక్కున చేర్చుకుంటున్నాయి. ఈ మైదానాలను వేదికగా చేసుకుని కోచ్‌లు, క్రీడాకారులు దశాబ్దాలుగా రాణిస్తున్నారు.

మినీ స్టేడియాలు ఇంకెప్పుడో..

నియోజకవర్గానికి ఒకటి చొప్పున మినీ స్టేడియాల నిర్మాణ పనులు ఏళ్ల క్రితమే ప్రారంభమయ్యాయి. ఇందులో పాల్వంచ మినీ స్టేడియం కొంత మెరుగైన స్థితిలో ఉంది. ఇక్కడ ఆధునిక ఆర్చరీ, టెన్నిస్ కోర్టులు అందుబాటులోకి రావడంతో ఈ విభాగానికి చెందిన క్రీడాకారులు రాత్రి, పగలు సాధన చేయగలుగుతున్నారు. ఒక్క టెన్నిస్‌లోనే 50 మంది వరకు ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇల్లెందు, కరకగూడెం (పినపాక) మినీ స్టేడియాల నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ రెండు స్టేడియాలు కనీస స్థాయిలో అందుబాటులోకి రావడానికి కూడా మరో ఆరు నెలలు పట్టే అవకాశం ఉంది. ఇక అశ్వారావుపేటకు సంబంధించి ఇటీవలే స్థలాన్ని గుర్తించగా భద్రాచలం స్టేడియాన్ని స్థలం సమస్య వెంటాడుతోంది.



ఇల్లెందులో నత్తనడకన సాగుతున్న మినీ స్టేడియం పనులు

కోచ్‌లు ఉంటే మెరుగైన ఫలితాలు

అథ్లెటిక్స్, ఆర్చరీ, వాలీబాల్, కబడ్డీ, బాక్సింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించేందుకు జిల్లాకు మంచి అవకాశాలు ఉన్నాయి. మినీ స్టేడియాలు అందుబాటులోకి వచ్చి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) నుంచి కోచ్‌లను నియమిస్తే ఇంకా మెరుగైన ఫలితాలు వస్తాయి.

– పరంధామరెడ్డి, జిల్లా క్రీడాశాఖాధికారి

బాల మేళా పోస్టర్ ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థుల అభ్యసన, సామర్థ్యాల పదర్శన లక్ష్యంగా ఈ నెలలో బాలమేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం బాలమేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న అభ్యసన సామర్థ్యాల పెంపు కోసం వినూత్న చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొన్ని పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా వర్క్‌షీట్లు అమలు చేసి ఫలితాల విశ్లేషణ తర్వాత జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించామని చెప్పారు. 165 పాఠశాలల్లో ప్రత్యేకంగా రూపొందించిన గ్రంథాలయాలు ఏర్పాటు చేశామని, నూతన ఉపాధ్యాయులను నియమించామని అన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో పాఠశాలల స్థాయిలో నిర్దేశించిన కార్యక్రమాలు పూర్తి చేసి బాలమేళా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కాంప్లెక్స్ స్థాయికి తీసుకురావాలని చెప్పారు. మండలస్థాయిలో ప్రతిభ చూపిన పాఠశాలలను గుర్తించి జిల్లాస్థాయిలో జరిగే బాలమేళాలలో సంబంధిత ఉపాధ్యాయులను సత్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగ రాజశేఖర్ పాల్గొన్నారు.



బాలమేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో సమస్యలపై వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి వేణుగోపాల్, విద్యాచందన, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులలో కొన్ని..

- దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ బదిలీ తన భర్త మూడేళ్ల క్రితం మరణించాడని, వృద్ధాప్య పెన్షన్ రద్దుచేశారని, తనకు వయోభారంతో పాటు పక్షవాతం వచ్చిందని, వృద్ధాప్య పెన్షన్ ఇప్పించాలని చేసిన దరఖాస్తును డీఆర్‌డీఓకు ఎండార్స్ చేశారు.
- పాల్వంచ మండలం పిల్లవాగు గ్రామానికి చెందిన గిరిజన రైతులకు ఉన్న భూమిలో వర్షాధార పంటలు పండిస్తున్నామని, వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, తమ ఆర్థిక పరిస్థితిని పరిశీలించి పొలాల్లో వ్యవసాయ బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని దరఖాస్తు చేయగా ఐటీడీఏ పీఓకు పంపించారు.
- కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని సఫాయిబస్తీలో ఇళ్లపై నుంచి 11కేవీ హెచ్‌టీ లైన్ వేశారని, దీంతో ఎప్పుడే జరుగుతోందని భయపడుతున్నామని, ఆ లైన్‌ను తొలగించాలని స్థానికులు చేసిన దరఖాస్తును విద్యుత్ శాఖాధికారులకు ఎండార్స్ చేశారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



ఈఓకు చెక్కు అందజేస్తున్న శ్రీమన్నారాయణాచార్యులు

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రామదాసు జయంత్యుత్సవాల సందర్భంగా చిత్రకూట మండపంలో కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కాగా, ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి తెల్లవారుజామున తిరువారాధన, శాత్తుమురై సేవలు, సాయంత్రం సూర్యప్రభ వాహన సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

జానకి సదనం నిర్మాణానికి విరాళం..

శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న జానకీ సదనం పనులకు సంస్కృత పండితులు ఎస్‌జీ శ్రీమన్నారాయణాచార్యులు సోమవారం భారీ విరాళం ప్రకటించారు. ఈ మేరకు రూ.12 లక్షల చెక్కును ఆలయ ఈఓకు అందజేశారు.

మెరుగైన బోధనకు కృషి

డీఈఓ వెంకటేశ్వరా చారి

కరకగూడెం: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు కృషి చేస్తున్నామని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. మండలానికి మంజూరైన నవోదయ పాఠశాలకు తాత్కాలిక వసతి కల్పించేందుకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటేనే విద్యార్థులు బాగా చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. నవోదయ పాఠశాల రాకతో గ్రామీణ విద్యార్థులకు అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ నాగ రాజశేఖర్, ఎంఈఓలు వీరస్వామి, గడ్డం మంజుల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘ఓపెన్’ ఫీజు చెల్లింపునకు అవకాశం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ఓపెన్ స్కూళ్లలో పదో తరగతి చదివే అభ్యర్థులు మంగళవారం నుంచి పరీక్షల ఫీజు చెల్లించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మద్దినేని పాపారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పదో తరగతి, 11 నుంచి 13 వరకు ఇంటర్ అభ్యర్థులు ఫీజు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత ఏఐ సెంటర్‌లో సంప్రదించిన తర్వాత వెబ్‌సైట్, మీ సేవా, టీఎస్ ఆన్‌లైన్, డీడీ రూపంలో ఫీజు చెల్లించాలని వివరించారు.



జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న డీఈఓ

వ్యవసాయ క్షేత్రంలో మంత్రి తుమ్మల



మిరప తోటను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. మండలంలోని అప్పారావుపేట, మల్లారం గ్రామాల శివారులో ఉన్న తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. సోమవారం తెల్లవారుజామున ఓ వైపు మంచు కురుస్తుండగా తమ క్షేత్రంలో సాగు చేస్తున్న మిర్చి పంటను పరిశీలించి కాపలాదారులకు తగు సూచనలు చేశారు. అనంతరం గండుగులపల్లిలోని నివాసంలో మంత్రి తుమ్మలను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి ఆధ్వర్యంలో పలువురు కలిసి ఈ నెల 7న పట్వారిగూడెంలో జరిగే శివాలయ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని కోరారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో కాసాని నాగప్రసాద్, దొడ్డా ప్రసాద్, కొయ్యల అచ్యుత రావు, ఎర్రా వసంతరావు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సంస్కృతి ఉట్టిపడేలా మ్యూజియం నిర్మించాలి

అధికారులకు పీఓ రాహుల్ సూచన

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజన మ్యూజియం నిర్మించాలని, త్వరలో ప్రారంభించేలా పనులు పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న మ్యూజియం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోటింగ్ కోసం చేపట్టిన చెరువు మరమ్మతు పనులు పూర్తయినందున నీరు నింపి, ఇంకిపోకుండా చూడాలని, చెరువు చుట్టూ అందమైన పూల మొక్కలు నాటాలని, పర్యాటకులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గడ్డిగుడిసెల వద్ద మట్టితో ఫ్లోరింగ్ చేసి అందమైన ముగ్గులు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, హరీష్, వీరస్వామి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ముగిశాకే పరిష్కారం..

గిరిజన దర్బార్‌లో వచ్చిన వినతులను రిజిస్టర్‌లో నమోదు చేసి, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతే పరిష్కరిస్తామని పీఓ రాహుల్ తెలిపారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, అధికారులు నాగార్జునరావు, రవీంద్రనాథ్, చంద్రశేఖర్, భాస్కర్, వేణు, ఉదయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, మునిధర్ పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న పీఓ తదితరులు

కేంద్రానిది రాజకీయ బడ్జెట్

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ బీజేపీ బడ్జెట్ మాత్రమేనని, ఆ పార్టీ రాజకీయ అవసరాలను తీర్చేలా కేటాయింపులు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఖమ్మంలో సోమవారం జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ విధానాలతో పేదలు మరింత పేదలవుతుంటే సంపన్నులు ఇంకొంత సంపద పోగేసుకునే అవకాశం వస్తోందన్నారు. వేతన జీవులకు ఊరట అని ప్రకటించినా, సోమవారం నాటి నిర్మలా సీతారామన్ ప్రకటనతో వారు సైతం ఆలోచనలో పడ్డారని తెలిపారు. ఓ పక్క మత విశ్వాసాలను రెచ్చగొడుతూ మరోపక్క ప్రైవేటీకరణలో వేగం పెంచుతున్న బీజేపీ దేశంలో శాంతి, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రమాదకరంగా మారిందని అన్నారు.

‘స్థానిక’ పోరుకు సిద్ధం..

- మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణ
- జిల్లాలో 4,264 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 2,046 పోలింగ్ బాక్సులు రెడీ చేశాం
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 6,33,947 మంది
- ‘సాక్షి’తో డీపీఓ చంద్రమౌళి

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే వివరాలు వెల్లడించడంతో బీసీ జనాభా లెక్క తేలింది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్ల ప్రక్రియ మాత్రమే మిగిలి ఉంది. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఈనెల 15లోపు షెడ్యూల్ వస్తుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి సోమవారం ‘సాక్షి’కి వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. జిల్లాలో 22 మండలాల పరిధిలో 481 గ్రామపంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాం. మొదటి విడతలో 8 మండలాలు, రెండు, మూడో విడతల్లో ఏడు మండలాల చొప్పున విభజించి ఆయా జీపీలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించాం. ఓటర్ల జాబితాల్లో మార్పులు చేర్పులు చేపట్టి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నవంబర్ 30న తుది ఓటర్ల జాబితాలను ప్రకటించాం. జిల్లాలో మొత్తం 6,33,947 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. 481 పంచాయతీలు, 4,232 వార్డులకు ఎన్నికల నిర్వహణకు 4,264 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశాం. మరోసారి డ్రాఫ్ట్ ప్రక్రియ రూపొందించనున్న నేపథ్యంలో చివరలో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది.

7,863 మందికి విధులు..

పంచాయతీ ఎన్నికల కోసం గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలతో పాటు అవసరమైతే ప్రైవేటు భవనాల్లోనూ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. వాటిలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులు వంటి వసతులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఎన్నికల కోసం పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 7,863 సిబ్బందికి బాధ్యతలు అప్పగిస్తున్నాం. గతంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ ఆధారంగా ఇప్పటికే ప్రాథమికంగా జాబితా రూపొందించాం. విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎన్నికలపై పూర్తి అవగాహన కల్పిస్తాం. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందస్తుగానే గుర్తిస్తున్నాం. అక్కడ ప్రజలతో పాటు పోలీసు శాఖ సహకారంతో ఎన్నికలు సజావుగా జరిగేలా జాగ్రత్తలు చేపడతాం. ఎన్నికలకు అవసరమైన సామగ్రిలో దాదాపు 80 శాతం ఇప్పటికే జిల్లాకు వచ్చింది. వాటిని పలు కార్యాలయాల్లో భద్రపరిచాం. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. వారి నుంచి పోలింగ్ కేంద్రాలు, వసతుల కల్పన, ఇతర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నాం.



డీపీఓ చంద్రమౌళి

క్లుప్తంగా

6 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు



కలెక్టర్‌ను కలిసిన బ్యాడ్మింటన్ పోటీల నిర్వాహకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర స్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు కొత్తగూడెంలోని హనుమాన్‌బస్తీ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ సెక్రటరీ డాక్టర్ కె.సావిత్రి తెలిపారు. పోటీల్లో 35 ఏళ్ల వయసు నుంచి 85 ఏళ్ల వయసు ఉన్న పురుషులు, మహిళలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ యుగంధర్, రాసపల్లి రాజేంద్రప్రసాద్, టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అన్నం వెంకటేశ్వర్లుతోపాటు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి బహుమతి ప్రదానోత్సవానికి రావాలని ఆహ్వానించారు. శాలువాతో కలెక్టర్‌ను సన్మానించారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్‌కు మెమోలు

దుమ్ముగూడెం : అంగన్‌వాడీ కేంద్రంలోని లబ్ధిదారులకు కాలం చెల్లిన పాల ప్యాకెట్లు పంపిణీ చేసిన ఘటనలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనసూర్యకు, టీచర్ సరళ కుమారికి మెమోలు జారీ చేసినట్లు సీడీపీఓ జ్యోతి తెలిపారు. సోమవారం తూరుబాక పంచాయతీ రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని లబ్ధిదారులతోపాటు ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి కాలం చెల్లిన పాల ప్యాకెట్లు పంపిణీ చేశారని తేలడంతో మెమోలు జారీ చేశారు.

హత్య కేసులో నిందితుడు రిమాండ్

దుమ్ముగూడెం : మండలంలోని గోవిందాపురం గ్రామంలో భార్య హతమార్చిన నిందితుడు తాటి నరసింహారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్ సోమవారం తెలిపారు. రెండు రోజుల క్రితం నరసింహారావు తన భార్య జయను కత్తితో అత్యంత దారుణంగా పొడిచి హత్య చేసిన సంగతి తెలిసిందే. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.

పశువులు పట్టివేత



పోలీసులు పట్టుకున్న పశువుల వాహనం

చంద్రుగొండ: రెండు ట్రాలీల్లో అక్రమంగా తరలిస్తున్న 11 పశువులను సోమవారం పోలీసులు చంద్రుగొండ శివారులో పట్టుకున్నారు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. ట్రాలీలో అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం నుంచి హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్న ఆరు పశువులను, మరో ట్రాలీలో రాజాపురం, కట్టుగూడెం ప్రాంతాల్లో కొనుగోలు చేసి హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్న మరో ఐదు పశువులను పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న కోదాడకు చెందిన కాళిదాసు దుర్గామల్లేష్, కట్టుగూడెం ప్రాంతానికి చెందిన మోరం రాజయ్యలపై కేసు నమోదు చేశారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నారులపై కుక్కల దాడి

ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడ్డ చిన్నారులు యశ్వంత్, వరుణ్‌తేజ్

టేకులపల్లి: కుక్కలు దాడి చేయడంతో సోమవారం ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గోలియాతండా పంచాయతీ వాగొడ్డుతండాకు చెందిన మూడో తరగతి విద్యార్థి కేలోత్ యశ్వంత్ సోమవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఆడుకునేందుకు వెళ్తుండగా వీధి కుక్క దాడి చేసింది. బాలుడి తొడను నోటితో పట్టి ఈడ్చుకు వెళ్లడంతో తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి కుక్కని బెదరగొట్టినా వదలకుండా బాలుడిని ఈడ్చుకెళ్లి బురదలో పడేసినట్లు బాలుడి తండ్రి మోహన్ తెలిపారు. చిన్నారిని కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించినట్లు పేర్కొన్నారు. కోయగూడెం పంచాయతీ బావోజీతండాకు చెందిన మాలోత్ వరుణ్ తేజ్ అనే పదకొండేళ్ల బాలుడిని పెంపుడు కుక్క కరిచింది. దీంతో వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

'టెలీ మానస్'తో ఊరట..

- టోల్ ఫ్రీ నంబర్ 14416 ద్వారా కౌన్సెలింగ్ సాయం
- విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు ప్రభుత్వ కార్యక్రమం



పినపాక కళాశాలలో టెలీమానస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దుర్గాభవాని(ఫైల్)

కరకగూడెం: ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షల సమయం దగ్గర పడుతోంది. దీంతో అధ్యాపకులు సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది విద్యార్థుల్లో పరీక్షలంటే భయం, ఆందోళన నెలకొన్నాయి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తామో? లేదోనని, తక్కువ మార్కులు వస్తాయేమోనని భయపడుతున్నారు. కొన్నిసార్లు ఆశించిన ఫలితాలు రానప్పుడు కొందరు విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలను చూస్తుంటాం. ఇది చాలా బాధాకరమైన విషయం. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేందుకు, వారి మానసిక స్థితిని మెరుగుపరిచేందుకు 'టెలీమానస్' టోల్ ఫ్రీ నంబర్ 14416ను అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రారంభించిన నేషనల్ టెలీమెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

మానసిక ఆరోగ్య సహాయం

టెలీమానస్ అనేది టెలీమెంటల్ హెల్త్ అసిస్టెన్స్, నేషనల్ టెలిమెంటల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా కార్యక్రమాల్లో ముఖ్యమైనది. మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు సహాయం చేసేందుకు ఉద్దేశించింది. ముఖ్యంగా పరీక్షల సమయంలో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు ఉపయోగకరమైనది. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు 14416కు ఫోన్ చేసి తగిన సాయం పొందవచ్చు. ఈ నంబర్ 24/7 అందుబాటులో ఉంటుంది. శిక్షణ పొందిన మానసిక ఆరోగ్య నిపుణులు సమస్యలను విని తగిన సలహాలు, సూచనలు చేస్తారు. ఈ క్రమంలో కళాశాలల్లో పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు ఈ సేవల పట్ల అవగాహన కల్పిస్తున్నాయి.

జీవితం పరీక్షల కంటే విలువైనది

పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమేననే విషయాన్ని విద్యార్థులు గుర్తించుకోవాలి. వాటి ఫలితాలు భవిష్యత్‌ను పూర్తిగా నిర్ణయించలేవు. మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. ఒత్తిడికి గురైనప్పుడు ఇతరుల సహాయం తీసుకునేందుకు వెనుకాడొద్దు. టెలీమానస్ సేవలు మీకు అందుబాటులో ఉన్నాయి. జీవితం పరీక్షల కంటే విలువైంది.

–దుర్గాభవాని, పినపాక ప్రభుత్వ వైద్యాధికారి

Tele MANAS 14416

టెలీమానస్ లక్ష్యాలు

- ✔ విద్యార్థుల్లో పరీక్షల భయం, ఆందోళనను తగ్గించడం
- ✔ మానసిక సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ఉచిత కౌన్సెలింగ్, సహాయం అందించడం
- ✔ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడం
- ✔ ఆత్మహత్యల నివారణకు కృషి చేయడం

జోరుగా రేషన్ బియ్యం విక్రయాలు



ద్విచక్రవాహనంపై తరలిస్తున్న రేషన్ బియ్యం

మణుగూరు టౌన్: అధికారుల నిర్లక్ష్యంతో పేదలకు ఆహారం కొరత లేకుండా ప్రతి నెలా రేషన్ బియ్యం అందించాలన్న ప్రభుత్వం సంకల్పం నీరు గారుతోంది. కొందరు అక్రమార్కులు నేరుగా డీలర్ల నుంచే కొనుగోలు చేస్తూ లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. పలువురు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా నగదు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కులతో కుమ్మక్కై రేషన్ బియ్యం నల్లబజార్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారులు వీధుల్లో తిరుగుతూ కిలో రూ.10, 12 చొప్పున కొని, మిల్లులు, టిఫిన్ సెంటర్లలో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తూకం మిషన్లను మోటార్‌సైకిళ్లపై పెట్టుకుని తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. సివిల్ సప్లై అధికారులు స్పందించి రేషన్ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కి నిరసన



ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న బాధితుడు (సర్కిల్‌లో)

ములకలపల్లి : ఎన్నో ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలంలో ఇల్లు నిర్మిస్తుంటే, కొందరు స్థానికులు అడ్డుకుంటున్నారని, గ్రామపంచాయతీ సిబ్బంది సైతం నోటీసులు జారీ చేశారంటూ మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. పోలీసుల కథనం ప్రకారం.. చౌటిగూడెం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గురవరాజు చాలా ఏళ్ల క్రితం ఇంటిస్థలం కొనుగోలు చేశాడు. కొన్నాళ్లపాటు ఇతర ప్రాంతాల్లో జీవనం సాగించిన ఆయన ఇటీవల సొంతూరికి వచ్చాడు. తాను కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం మొదలుపెట్టగా రిజనేతరులు ఇళ్లు నిర్మించవద్దని కొందరు గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. ఈ తరుణంలో జీపీ కార్యదర్శి మురళి నోటీసులు జారీ చేశాడు. దీంతో మనోవేదనకు గురైన గురువరాజు గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొన్నాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ పుల్లారావు ఘటనాస్థలికి చేరుకుని బాధితుడితో మాట్లాడి కిందకి దింపారు. ఈ విషయమై జీపీ సెక్రటరీ మురళిని వివరణ కోరగా.. సదరు భూ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందంటూ స్థానికులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈక్రమంలో రెండు నెలల క్రితం నోటీసులు జారీ చేశామని తెలిపారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఆదివారం రాత్రి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గోదావరి బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను గమనించి ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఉడాయించారు. దీంతో వెంబడించిన పోలీసులు రామాలయం వద్ద అదుపులోకి తీసుకున్నారు. తనిఖీలు నిర్వహించగా వారి వద్ద ఐదు కేజీల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన వ్యక్తులు రఘునాథపాలేనికి చెందిన నెమల అజయ్, వైరా సమీపంలోని సిరిపురానికి చెందిన కొత్తపల్లి కిరణ్ గుర్తించారు. గంజాయి విలువ రూ.1.25 లక్షలు ఉంటుందని, నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎమ్మెల్యే వాహనంలో ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రుడిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు

చర్ల: మండలంలోని ఆర్.కొత్తగూడెం శివారులో సోమవారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. వెంకటచెరువుకు చెందిన సోడి సంతోష్ ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాకు చెందిన కోమలి మంగుతో కలిసి చర్ల నుంచి భద్రాచలం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వైపు నుంచి చర్ల వైపు వస్తున్న టాటా మ్యాజిక్ ఆటో ఎదురుగావచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంతోష్, మంగుకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో భద్రాచలం నుంచి చర్లకు వస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రమాదాన్ని గమనించి ఆగారు. స్వయంగా వైద్యుడు కావడంతో క్షతగాత్రులను పరీక్షించారు. సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యులను అప్రమత్తం చేసి, తన వాహనంలో వ్యక్తిగత సహాయకులను తోడుగా ఇచ్చి ఆస్పత్రికి పంపారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరు మృతి

మరో నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకులు



రాంబాబు మృతదేహం

చర్ల: మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు సమీపంలో ఉన్న తిప్పాపురం రోడ్‌లో సోమవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జీడిపల్లికి చెందిన ముగ్గురు యువకులు, చర్ల మండలంలోని తిప్పాపురానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాలపై వెళ్తున్నారు. ఈ క్రమంలో తాలిపేరు ప్రాజెక్టు నుంచి తిప్పాపురం వెళ్లే మార్గంలో ఎడమ ప్రధాన కాలువ సమీపంలో ఉన్న డబుల్ రోడ్‌పై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో తిప్పాపురానికి చెందిన మిడియం రాంబాబు (28) తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్, దేవాల్, విజయకుమార్, దేవాలకు కూడా తీవ్ర గాయాలు కావడంతో తిప్పాపురం గ్రామస్తులు సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు.

విజ్ఞానం కోసం తమ వంతుగా..

గ్రంథాలయ నిర్వహణకు వధూవరుల విరాళం



విరాళం అందిస్తున్న నూతన జంట

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో ఇటుకల విశ్వనాధాచారి గ్రామ గ్రంథాలయ నిర్వహణకు గ్రామస్తులు చేయూతనిస్తున్నారు. గ్రామంలో ఎవరి ఇంట్లో వివాహం జరిగినా నూతన జంట తొలుత గ్రంథాలయాన్ని సందర్శించి తమ వంతు విరాళం అందించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సోమవారం దంతాల నవీన్ – మంజుల దంపతులు పెళ్లిబట్టలతోనే లైబ్రరీకి వచ్చి రూ.2,116 అందజేశారు. ఇప్పటి వరకు సుమారు 60మంది ఇలా విరాళాలు ఇచ్చారని, ఈ నగదును నిర్వహణ, పుస్తకాల కొనుగోలుకు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలురపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉద్యోగిపై పోక్సో కేసు

కారేపల్లి: మండలంలోని రేలకాయలపల్లి బాలుర ఆశ్రమ గురుకుల పాఠశాల విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లుపై సోమవారం పోక్సో కేసు నమోదైంది. డిప్యూటీ వార్డెన్ కొద్దినెలలుగా విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో విచారించిన అధికారులు గతనెల 30న ఆయనను సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే, సస్పెన్షన్ ఉత్తర్వులు తీసుకోకపోగా హెచ్‌ఎంపై దాడి చేసిన డిప్యూటీ వార్డెన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా తాజాగా ఓ బాలుడి తండ్రి పిర్యాదు చేయడంతో డిప్యూటీ వెంకటేశ్వర్లుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రమేష్ (ఫైల్)

సుజాతనగర్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటనపై సుజాతనగర్‌లో పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్సై ఎం.రమాదేవి కథనం ప్రకారం.. కోమటిపల్లి గ్రామానికి చెందిన రైతు కొర్రా రమేష్(30) మంత్రితండా గ్రామ శివారులోని వేరుశెనగ చేనుకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బాబాయి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు...

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నారాయణపూర్ – కాంకేర్ జిల్లాల సరిహద్దు అంతఘడ్–కోయిలిబెడా పోలీస్ స్టేషన్ల మధ్యలోని పానిదోబీర్ అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారని నిఘా వర్గాలు సమాచారం అందించగా, డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరిపారు. సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో గాలించడంతో ఓ మావోయిస్టు మృతదేహం లభ్యమైంది. సంఘటనా ప్రాంతంలో ఎస్‌ఎల్‌ఆర్ తుపాకీ, విప్లవ సాహిత్యం, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకుని, మృతదేహాన్ని కాంకేర్‌కు తరలించారు. మృతి చెందిన మావోయిస్టును గుర్తించాల్సి ఉందని కాంకేర్ ఎస్పీ దివ్యాంగ్‌పాటిల్ తెలిపారు.

అనుమానాదాస్పద స్థితిలో వ్యక్తి...

పాల్వంచ: అనుమానాదాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఓ ఇంట్లో పవన్ కుమార్(35) ఒంటరిగా ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పరిశీలించగా, పవన్ కుమార్ ఇంట్లో మంచం పక్కన మృతి చెంది ఉన్నాడు. మూడు, నాలుగు రోజుల క్రితమే అతను మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఎస్‌ఐ రాఘవయ్య సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ విషయమై ఎస్‌ఐను వివరణ కోరగా మృతికి కారణాలపై విచారిస్తున్నామని తెలిపారు.

క్వారీలో మట్టిపెళ్లలు కూలి మరొకరు..



ఎల్లయ్య (ఫైల్)

ఇల్లెందురూరల్: మండల పరిధిలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్‌నగర్‌తండా సమీపంలో ఉన్న ఓ క్వారీలో మట్టిపెళ్లలు మీద పడి పట్టణంలోని 24 ఏరియాకు చెందిన పల్లపు ఎల్లయ్య (40) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. క్వారీలలో సైజు రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్న ఎల్లయ్య క్వారీలో పనులు ముగించుకుని మట్టికుప్ప పక్కన సేదతీరుతున్నాడు. ఆ సమయంలో మట్టిపెళ్లలు మీదపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సింగరేణిలో డైరెక్టర్ పోస్టుల భర్తీ ఎప్పుడు?



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో కీలకమైన రెండు డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉండగా, ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. సంస్థ మనుగడ, అభివృద్ధి, భవిష్యత్ కార్యాకలాపాల పర్యవేక్షణకు ఆరుగురు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఉండగా, పరిపాలన, కొత్త ప్రాజెక్టుల సర్వే, గనుల నిర్వహణ, ఇతర కార్యకలాపాల కోసం వీరు కీలకంగా వ్యవహరిస్తారు. ఇందులో సీఎండీకి తోడు డైరెక్టర్లు పా(పర్సనల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ వెల్ఫేర్), ఫైనాన్స్, ఆపరేషన్స్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్, ఈ అండ్ ఎం పోస్టులు ఉంటాయి. అయితే, డైరెక్టర్ ఈ అండ్ ఎంగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణరావుకు ఇటీవల డైరెక్టర్ (ఆపరేషన్స్) పోస్టును ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే కట్టబెట్టారు. అలాగే, సీఎండీ బలరామ్ డైరెక్టర్(ఫైనాన్స్) బాధ్యతలు నిర్వర్తిస్తుండగా డైరెక్టర్ పా, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ పోస్టులు గతనెల 31న ఖాళీ అయ్యాయి. అయితే, డైరెక్టర్ పోస్టు ఖాళీ కావడానికి 20రోజుల ముందు నుంచే ఎంపిక ప్రక్రియ చేపట్టాలి. ఏరియాల్లో రెండేళ్లు పనిచేసిన అనుభవం , మరో రెండేళ్ల సర్వీస్ మిగిలి ఉండి ఎలాంటి విజిలెన్స్ కేసులు, ఇతర అవినీతి ఆరోపణలు లేని వారిని పరిగణనలోకి తీసుకుని మెడికల్ నివేదిక అనంతరం రాష్ట్ర ఇంధన శాఖ, చీఫ్ సెక్రటరీ నియమిస్తారు. కానీ ఈసారి ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎప్పుడు నియమిస్తారో తెలియడం లేదు. ఇదిలా ఉండగా కార్పొరేట్ కార్యాలయంలో జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ రిక్రూట్‌మెంట్ సెల్) కోడూరు శ్రీనివాస్ జనవరి 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆయన నిర్వర్తించిన బాధ్యతల్లో పర్సనల్ వెల్ఫేర్ విభాగాన్ని జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం)కు, రిక్రూట్‌మెంట్ సెల్ విభాగాన్ని జీఎం(ఈఈ సెల్)కు ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే కేటాయించారు. ఇదేసమయాన మైనింగ్ సర్దార్ల వెబ్‌కౌన్సిలింగ్‌ను ఎన్నికల కోడ్ పేరిట వాయిదా వేశారు. దీంతో సంస్థ భిన్న వైఖరిపై చర్చ జరుగుతుండగా డైరెక్టర్ల పోస్టుల భర్తీపై మాత్రం స్పష్టత రావడం లేదు.

ఆదివాసీ కోయల సమస్యలు పరిష్కరించాలి



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలు

భద్రాచలంఅర్బన్: ఆదివాసీ కోయల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోయ భాష మాట్లాడుతూ, ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను పాటిస్తున్న తామంతా ఒకే కులానికి చెందిన కోయలమని పేర్కొన్నారు. తమ వాళ్లు దట్టమైన అటవీ ప్రాంతం కొండకోనల్లో నివాసం ఉండటంతో 1950, 53, 56 రాష్ట్రపతి గెజిట్‌లో, కులగణనలో గుట్ట కోయలుగా పేర్కొన్నారని అన్నారు. అయితే తమను వలస ఆదివాసీలు అంటూ ప్రభుత్వ పథకాలు అందకుండా చేయడం సరికాదన్నారు. వేరే ప్రాంతాల నుంచి 2013లో వలస వచ్చి ఆధార్ అడ్రస్‌లు మార్చుకుని స్థానికంగా పోడు భూములు కొనుగోలు చేసిన వారికి 2023లో పోడు భూములు పట్టాలు ఇచ్చారని, వలసవాదులంటూ, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి ఆధార్ కార్డు మార్చుకున్నారంటూ తమకు పోడు భూమి పట్టాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పోడు భూమి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు రామారావు, పోడియం నరేంద్ర కుమార్, సున్నం వెంకటరమణ, నరసింహారావు, మడివి సునీల్, కట్టం కోస, వెట్టి బీమా, మడకం దేవా, మడకం చలపతి, మడకం నందా, కొంచెం అనిల్, సోడే గంగ పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాల కేసులో అరెస్ట్

పీఏసీఎస్ చైర్మన్ లక్కినేనితో పాటు మరొకరి రిమాండ్

టేకులపల్లి: మొక్కజొన్న విత్తనాల కేసులో టేకులపల్లి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు నెలన్నర క్రితం చంద్రుతండా, గోప్యాతండా, సూర్యాతండా రైతులకు ఆడ, మగ మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. పంట రాకపోతే నష్టపరిహారం ఇస్తానని ఒప్పుకున్నారు. అయితే లిఖితపూర్వకంగా ఎలాంటి అగ్రిమెంట్ చేయలేదు. రెండు వారాల క్రితం ఈ గ్రామాల్లో సుమారు 40 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. దీంతో ఒప్పందం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరగా, వారం రోజుల్లో ఇస్తానని కంపెనీ ఆర్గనైజర్ సమక్షంలో లక్కినేని హామీ ఇచ్చారు. గడువు దాటినా పరిహారం ఇవ్వకపోవడంతో గత నెల 31న రైతు జేత్యా బాధితుల వివరాలతో టేకులపల్లి పోలీసులకు సురేందర్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ యువజన నాయకుడు భూక్య రాజాపై ఫిర్యాదు చేశాడు. దీనిపై ఈనెల 1న సీఐ, ఎస్‌ఐ, ఏవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి లక్కినేని సురేందర్‌రావుతో పాటు భూక్య రాజాను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం ఇల్లెందు జడ్జి వద్దకు తీసుకెళ్లగా 14 రోజులు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ పోగుల సురేష్ తెలిపారు.



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న వాసు

వలంటీర్ల కోసం సమిధనవుతా..

- కూటమి ప్రభుత్వం వారిని విధుల్లోకి తీసుకోకుండా వేధింపులు
- సర్కారు తీరును నిరసిస్తూ యువకుడి ఆత్మహత్యాయత్నం

సాక్షిప్రతినిధి, విజయవాడ: 'కష్టాల్లో ఉన్న వలంటీర్ వ్యవస్థను కాపాడుకుందాం.. కరోనా సమయంలో వారు చేసిన సేవలను గుర్తిద్దాం. మనలోని మానవత్వాన్ని చాటుకుందాం' అంటూ ఓ యువకుడు బ్యానర్‌ను ప్రదర్శిస్తూ విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం దగ్గర సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. వలంటీర్లపై టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత ధోరణిని నిరసిస్తూ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన నక్కా వాసు ఒంటిపై పెట్రోల్ పోసుకుని లైటర్‌తో నిప్పు అంటించుకుంటుండగా.. అక్కడే విధుల్లో ఉన్న సూర్యారావుపేట సీఐ అబ్దుల్ అలీషేక్ అడ్డుకున్నారు. అనంతరం సూర్యారావుపేట స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్లు చేస్తున్న ఆందోళన తనను కలిచి వేసిందన్నాడు. కరోనా సమయంలో సొంత వాళ్లే దగ్గరకు రాని దుర్భర పరిస్థితుల్లో వలంటీర్లు ప్రజలకు మర్చిపోలేని సేవలందించారని గుర్తుచేశాడు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నేడు పింఛన్ కోసం పడరాని పాట్లు పడుతున్నారని, వలంటీర్లు ఉన్న రోజుల్లో హాయిగా ఇళ్ల వద్దే పింఛన్‌లు తీసుకున్నారని చెప్పారు. అప్పటి నుంచే వలంటీర్ వ్యవస్థకు అభిమానిగా మారానని, అంతటి సేవ చేసిన వలంటీర్లను ప్రస్తుత ప్రభుత్వం విధుల్లోకి తీసుకోకుండా వేధిస్తుండటంపై మనస్తాపానికి లోనై ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినట్టు చెప్పాడు. వాసు కొన్నేళ్లుగా తండ్రితో కలిసి ఉండవల్లి సమీపంలోని పోలకంపాడులో ఉంటున్నాడు. కుంచనపల్లిలో నాటు కోళ్ల ఫాంను నడుపుతూ విజయవాడ, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లోని చికెన్ షాపులకు నాటు కోళ్లను సరఫరా చేస్తుంటాడు. వాసు తండ్రి ఫైర్ స్టేషన్‌లో పని చేస్తుంటాడు. వాసుకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. కేవలం వలంటీర్ వ్యవస్థ రావాలని బలంగా కోరుకుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

కూటమి కాలకేయుల సాక్షిగా..

ప్రజాస్వామ్యం ఖూనీ!

ఏపీలో మున్సిపల్ ఉప ఎన్నికల్లో అధికార మదంతో అరాచక పర్వం

సాక్షి ప్రతినిధి, తిరుపతి, సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ఆదిమ తెగల్లోనూ కానరాని అకృత్యాలు టీడీపీ కూటమి సర్కారు పాలనలో ఆవిష్కృతమయ్యాయి! పట్టపగలు.. తిరుపతి నడి రోడ్డుపై పోలీసులు, జనం సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. తాలిబన్లు.. ఐసిస్.. హమాస్ ఉగ్రమూకలను తలదన్నే రీతిలో రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ ఉప ఎన్నికల్లో పచ్చ ముఠాలు దాడులకు తెగబడి విధ్వంసం, భయోత్పాతం సృష్టించాయి! పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఛైర్మన్‌లు, డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్మన్ పదవులకు సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నేతలు అరాచకాలకు తెగబడ్డారు. అసలు ఒక్క సీటు కూడా గెలవని చోట్ల.. తమకు ఏమాత్రం సంఖ్యా బలం లేని చోట్ల భయపెట్టి నెగ్గేందుకు కూటమి పార్టీలు కుతంత్రాలకు దిగాయి. పోలీసులతోపాటు ఆర్డీవో.. కలెక్టర్ దాకా ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ వాడుకుంటూ అధికార దుర్వినియోగానికి బరి తెగించాయి. బల ప్రయోగం, అక్రమాలు, అరాచకాలు, ప్రలోభాలతో ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం తెచ్చేలా వ్యవహరించాయి. మునిసిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ గుర్తులతో జరిగాయి. అలాంటిది.. ఒక పార్టీ గుర్తుపై నెగ్గిన వారిని భయపెట్టి, ప్రలోభాలకు గురి చేసి ఇంత దారుణంగా ఫిరాయింపులకు ప్రోత్సహిస్తుంటే.. అసలు ఇక ఎన్నికలు ఎందుకు? పార్టీ గుర్తులు ఎందుకు? అని ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికలో నెగ్గేందుకు కూటమి పార్టీల గూండాలు అరాచకం సృష్టించారు. ఉప ఎన్నికలో పాల్గొనేందుకు వాహనంలో వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సు ఆపి రాడ్లతో అద్దాలు పగలగొట్టి లోపలకు చొరబడి దాడులకు తెగబడ్డారు. బస్సులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై దాడిచేసి చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లారు. మహిళా కార్పొరేటర్ల ఆర్తనాదాలు ఖాకీల చెవికెక్కలేదు. కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళుతున్న కూటమి గూండాల వాహనాలకు పోలీసులు దగ్గరుండి దారిచ్చి సాగనంపడం నివ్వెరపరుస్తోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు పోలీసుల సాక్షిగా కూటమి గూండాలు చిత్తూరు, తిరుపతిలో సృష్టించిన అరాచకం ఇదీ!!

మూడు నగర కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీల్లో ఖాళీ అయిన డిప్యూటీ మేయర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు సోమవారం ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా టీడీపీ నేతల దౌర్జన్యాలు, దాడులు, బెదిరింపులతో సగం చోట్ల ఐదు చోట్ల ఎన్నికలు జరగకుండా వాయిదా పడటం గమనార్హం.



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బస్సు అద్దాలను పగలగొడుతున్న కూటమి గూండా శంకర్‌యాదవ్



తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి కారులో తీసుకెళుతున్న కూటమి గూండాలు

అర్ధరాత్రి నుంచి అరాచకం..

మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి కార్పొరేషన్‌లో మొత్తం 49 డివిజన్లకు గానూ 48 చోట్ల వైఎస్సార్‌సీపీ గెలుపొందింది. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయడంతో తిరుపతి డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ పదవులకు రాజీనామా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడింది. కూటమికి ఒకే ఒక్క కార్పొరేటరే ఉన్నా అధికార బలంతో దాన్ని దక్కించుకునేందుకు కుట్రలకు తెర తీశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాలులో సోమవారం డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలనే కుయుక్తులతో కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసేందుకు సిద్ధమయ్యారు. .

బస్సుని అడ్డుకుని.. అద్దాలు ధ్వంసం చేసి

డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక కోసం సోమవారం ఉదయం 11 గంటలకు కార్పొరేటర్లంతా భూమన నివాసం నుంచి ప్రత్యేక బస్సులో ఎస్వీ యూనివర్సిటీలోని సెనెట్ హాలు వద్దకు బయలు దేరారు. దాదాపు 25 మంది కార్పొరేటర్లు, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అందులో ఉండగా వర్సిటీ సమీపంలో వారి బస్సును కూటమి గూండాలు అడ్డుకున్నారు. సుమారు 500 మంది ఒకేసారి బస్సుపైకి దూసుకొచ్చి పోలీసుల సమక్షంలోనే రాడ్లతో అద్దాలను పగులగొట్టారు. లోపలకు చొరబడి బస్సు తలుపు తెరిచారు. బస్సులో ఉన్న అమరనాథరెడ్డి, అనీష్‌రాయల్, మోహన్‌కృష్ణ యాదవ్, బోగం అనిల్, వెంకటేష్‌పై దాడిచేసి చొక్కా పట్టుకుని ఈడ్చుకెళ్లారు. అప్పటికే సిద్ధంగా ఉన్న వాహనాల్లో కార్పొరేటర్లను బలవంతంగా ఎక్కించి అతివేగంగా దూసుకెళ్లారు. బస్సులో ముందు వైపు కూర్చున్న మహిళా కార్పొరేటర్లను నెట్టుకుంటూ లోపలకు చొరబడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. కార్పొరేటర్లు కేకలు వేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. కార్పొరేటర్లను కాపాడకపోగా మిగిలిన వారిపై దౌర్జన్యానికి దిగారు.

ఎంపీ, సాక్షి ప్రతినిధులపై దాడి

కార్పొరేటర్లతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ఎంపీ గురుమూర్తిపై కూడా కూటమి గూండాలు దాడికి యత్నించారు. బస్సు ముందు సీట్లో కూర్చొని ఉన్న ఎంపీపై రాడ్లతో దాడి చేసేందుకు యత్నించగా గన్‌మెన్‌ను చూసి వెనక్కి తగ్గారు. ఈ అరాచకాలను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధి, సాక్షి ఫోటోగ్రాఫర్‌పై దాడి చేశారు. ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్, సునీల్ చక్రవర్తి ఫోటోగ్రాఫర్ చేతిలోని రూ.రెండు లక్షలు విలువచేసే కెమెరాను లాక్కుని ధ్వంసం చేశారు. సెల్‌ఫోన్లో ఘటనను చిత్రీకరిస్తున్న సాక్షి ప్రతినిధిపై కూడా దాడికి తెగబడ్డారు. ఉదయం 10.15 గంటల నుంచి 10.45 వరకు యధేచ్ఛగా సాగిన విధ్వంసంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కూటమి నేతల విధ్వంస కాండతో రాకపోకలన్నీ స్తంభించిపోయాయి. బస్సులో, వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు ఈ ఘటనను చూసి 'ఇంత అరాచకమా? ఇంత బరి తెగింపా?' అంటూ నివ్వెరపోయారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



'సచివాలయం'లో నీడ కరువు

రాష్ట్ర సచివాలయం ప్రధాన గేట్ల వద్ద నిలువ నీడలేక.. వివిధ పనులపై వచ్చే సందర్శకులు, అక్కడ విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రం నలుమూలలనుంచి వచ్చే ప్రజలు గేట్-2 నుంచి లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే ముందుగా పాస్‌లు తీసుకున్నాక, పోలీసు సిబ్బంది తనిఖీ తర్వాత వారిని అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో అక్కడ చాలా సేపు వేచి ఉండాల్సి ఉంటుంది. గేట్ల వద్ద నీడనిచ్చే సదుపాయం లేక ఎండైనా, వానైనా అలాగే ఉండాల్సి వస్తోంది. అలాగే గేట్-4 వద్ద కూడా పరిస్థితి ఇలాగే ఉంది. వచ్చేది ఎండాకాలం కావడంతో ఇక్కడ టెంట్ లాంటివి ఏర్పాటు చేయాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.

– సాక్షి, హైదరాబాద్

'ఏఐ' అంటే హైదరాబాద్ గుర్తుకు రావాలి

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కొత్త సవాళ్లకు యువత సిద్ధంగా ఉండాలి
- డీటీసీసీ కార్యాలయం ప్రారంభించిన మంత్రి



డీటీసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ)లో రాష్ట్ర యువతను నిపుణులుగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం హైటెక్ సిటీలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తున్న డిపాజిటరీ ట్రస్ట్ క్లియరింగ్ కార్పొరేషన్(డీటీసీసీ) నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏఐ సిటీని నిర్మించనున్నామని, అక్కడే ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, దాని నిర్వహణలో సంబంధిత పరిశ్రమలను, ఏఐ నిపుణులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఏఐ అంటే తెలంగాణ, హైదరాబాద్ అని గుర్తుకు వచ్చేలా తీర్చి దిద్దుతామన్నారు. రోజురోజుకీ టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోందని, అదే సమయంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో యువత వినూత్నంగా ఆలోచించి, వాటి పరిష్కారాల కోసం నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించా రు. ఆ దిశగా కృషి చేసే వారికి ప్రభు త్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు అన్ని రంగాలకు చెందిన కంపెనీలున్నాయని, అలాంటివి 100 నుంచి 120 కంపెనీలు ఇక్కడి నుంచే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అన్ని రకా ల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉందన్నారు. దేశంలో డీటీసీసీ తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉందని, తద్వారా సుమారు 500 మందికి కొత్తగా ఉపాధి దొరకబోతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ కంపెనీలో 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని కోరగా, అందుకు యాజమాన్యం అంగీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీసీసీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రెనీ లారోకే మోరీస్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లిన్ బిషప్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

తునికాకు టెండర్లు నిర్వహించాలి

ఇల్లెందురూరల్: సీజన్ ముంచుకొస్తున్న నేపథ్యాన తునికాకు సేకరణ టెండర్లు వెంటనే నిర్వహించడంతోపాటు సకాలంలో ప్రూనింగ్ పనులను ప్రారంభించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఆరు లక్షల మంది ఆదివాసీ, గిరిజనులకు వ్యవసాయం తర్వాత తునికాకు సేకరణతోనే ఎక్కువ ఆదాయం వస్తుందని తెలిపారు. ఆకు సేకరణకు రాష్ట్రంలో 196 యూనిట్లు ఉండగా, త్వరగా టెండర్ల పిలవడంతో పాటు స్త్రీ, పురుషులకు సమానంగా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాక 50 ఆకుల కట్టకు ధర రూ.6గా నిర్ణయించాలని ఆయన సూచించారు. తద్వారా ఆకు సేకరణ లక్ష్యాన్ని చేరుకుంటే ప్రభుత్వంతో పాటు కాంట్రాక్టర్లు, కూలీలకు ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అంతేకాక ఆకు సేకరణ సమయాన జరిగే ప్రమాదాలకు నష్ట పరిహారం చెల్లించాలని, కొన్నేళ్లుగా పెండింగ్ ఉన్న బోనస్‌ను చెల్లించాలని కోరారు. గతంలో బోనస్ చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని అశోక్ డిమాండ్ చేశారు.

రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసిన గ్రూప్–డీ నోటిఫికేషన్‌కు జిల్లాలోని గిరిజన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 22వ తేదీలోగా రూ.250చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో కానీ 77299 61197 నంబర్‌లో కానీ సంప్రదించాలని సూచించారు.

ఇంగ్లిష్ మీడియం.. పౌష్టికాహారం



కారేపల్లిలోని మోడల్ స్కూల్

నోటిఫికేషన్ వివరాలిలా	
దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ	ఫిబ్రవరి 28
ఫీజు	జనరల్ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, దివ్యాంగులకు రూ.125
హాల్‌టికెట్ల డౌన్‌లోడ్	ఏప్రిల్ 3నుంచి
ప్రవేశపరీక్ష (6వ తరగతి)	ఏప్రిల్ 13 (ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు)
7నుంచి 10వ తరగతుల వారికి	ఏప్రిల్ 13 (మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు)
ఫలితాలు విడుదల	మే 20
ఎంపికైన వారి జాబితా ప్రదర్శన	మే 28
ధ్రువపత్రాల పరిశీలన	మే 29నుంచి జూన్ 3వ తేదీ వరకు

ఉమ్మడి జిల్లాలో రెండు మోడల్ స్కూళ్లు

- ఆరో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్
- ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశ్యంతో లక్ష్యంతో 2013–14లో మోడల్ స్కూళ్ల ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 194 పాఠశాలలను ఏర్పాటు చేయగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు నెలకొల్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించటంతో పాటు రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలనే లక్ష్యంతో మోడల్ స్కూళ్లను ఏర్పాటుచేశారు. ఆధునిక వసతులతో పాటు ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతోంది. ఈనేపథ్యాన మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది.

ఆరు నుంచి ఇంటర్ వరకు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి, కారేపల్లిలో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 6నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధన కొనసాగుతోంది. ఒక్కో తరగతికి 100మందికి ప్రవేశాలు కల్పిస్తారు. అయితే, ఆరో తరగతిలో 100మందికి ప్రవేశాలు కల్పించి వారిని పై తరగతులకు ప్రమోట్ చేస్తుండగా, మిగతా తరగతుల్లో ఎవరైనా మధ్యలో వెళ్లిపోతే ఖాళీలను మాత్రం భర్తీ చేస్తారు. పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పించనుండగా 2025–26వ విద్యాసంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం http://telanganagms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..



మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతోంది. ప్రవేశాల షెడ్యూల్ విడుదలైనందున ఎంఈఓల ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. – సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

● ఎర్ర తివాచీ పరిచినట్లుగా ...



చర్ల మండలంలో రైతులు సాగు చేసిన మిర్చి చేతికొస్తోంది. ఇప్పుడిప్పుడే కోతలు ఊపందుకుంటుండగా రైతులు మిర్చిని కల్లాలు, రహదారుల పక్కన ఆరబోస్తున్నారు. దీంతో ఏ గ్రామంలో చూసినా ఆయా ప్రాంతాలు ఆరబోసిన మిర్చితో ఎర్ర తివాచీ పరిచినట్లుగా కనిపిస్తున్నాయి. – చర్ల

■ మంచుతెరలు కాదు.. దుమ్ము పొరలు





కొణిజర్ల పోలీస్‌స్టేషన్ వద్ద..
(ఇన్‌సెట్) తనికెళ్ల వద్ద గాలిలో దుమ్ము

ఈ ఫొటోలు చూడగానే శీతాకాలంలో తెల్లవారు జామున మంచు పొరలు కమ్మేశాయని అనుకోవడం సహజమే. కానీ ఇది నిజం కాదు! రోడ్డుపై దుమ్ము కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనపడని చిత్రాలివి. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల కోసం టిప్పర్లలో ఫ్లైయాష్ తరలిస్తుండగా పైన పట్టాలు లేకుండా వెళ్తుండడంతో ఖమ్మం నుంచి వైరా వరకు రహదారిని దుమ్ము ఇలా మూసేస్తోంది. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి ఎదురు వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున టిప్పర్ల డ్రైవర్లకు పోలీసులు సూచనలు చేయాలని కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

కార్మికుల పెన్షన్ ఫండ్ బలోపేతం

- టన్నుకు సెస్ రూ.20గా సీఎంపీఎఫ్ బోర్డ్ నిర్ణయం
- విత్ డ్రాలు పెరుగుతుండడంతో బలహీనమవుతున్న 'ఫండ్'
- ఫలితంగా మార్పులకు ఆమోదం



భూగర్భగనుల్లో పనిచేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా పరిధిలోని సింగరేణి సహా తొమ్మిది బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు ఉద్యోగ విరమణ అనంతరం ఎదుర్కొంటున్న పెన్షన్ సమస్య పరిష్కారానికి సీఎంపీఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గత నెల 17న బీఓటీ ఛైర్మన్ కమ్ కోల్ సెక్రటరీ సమక్షాన సీఎంపీఎఫ్ ట్రస్ట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్‌కు జమ అయ్యే నగదు కంటే విత్‌డ్రాలు ఎక్కువగా ఉండడంతో పెన్షన్ ఫండ్ బలహీనం అవుతున్న అంశంపై చర్చించారు. ఈనేపథ్యాన పెన్షన్ ఫండ్ పెంచాలని పలు కార్మిక సంఘాల నాయకులు, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్‌లు కోరారు. దీంతో కోలిండియా పరిధిలో ఉత్పత్తి అయ్యే ప్రతీ టన్ను సరుకుకు ప్రస్తుతం కేటాయిస్తున్న రూ.10ను రూ.20కి పెంచారు. కార్మికుల వేతనంలో ఏడు శాతానికి, యాజమాన్యం మరో ఏడు శాతం కలుపుతున్నా పెన్షన్ చెల్లింపుల్లో అసౌకర్యం కలుగుతున్న నేపథ్యాన ట్రస్ట్ ఈ నిర్ణయం తీసుకుంది.

నెలనెలా పెరుగుతున్న పెన్షనర్లు

కోలిండియా పరిధి ఎనిమిది బొగ్గు పరిశ్రమల్లో గతంలో సుమారు 6లక్షల మంది కార్మికులు పనిచేసేవారు. కానీ ఇప్పుడు 3లక్షల మందే ఉన్నారు. అలాగే, సింగరేణిలో పదేళ్ల క్రితం 62 వేల మంది కార్మికులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 39 వేలకు పడిపోయింది. తద్వారా కోలిండియాలో సుమారు 3లక్షల మంది, సింగరేణిలో 23వేల మంది గడిచిన పదేళ్లలో ఉద్యోగ విరమణ చేశారు. అయితే రోజురోజుకు బొగ్గు పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య తగ్గి, పెన్షనర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు ఈ గణాంకాలు చెబుతున్నాయి. దీంతో సీఎంపీఎఫ్ ఫండ్‌కు జమ అవుతున్న నగదు కంటే విత్‌డ్రా పెరుగుతోంది. ఈ నేపథ్యాన సెస్ పెంచుతూ సీఎంపీఎఫ్ ట్రస్ట్ ఆమోదం తెలిపింది.

సరైన సమయంలో నిర్ణయం



కార్మికుల సంఖ్యతో పాటే సీఎంపీఎఫ్‌లో ఫండ్ తగ్గుతోంది. ఇదిలాగే సాగితే భవిష్యత్ తరాలకు పెన్షన్ ఇవ్వడం సాధ్యం కాదు. ఈనేపథ్యాన సరైన సమయంలో చర్చించి టన్నుకు చెల్లిస్తున్న సెస్‌ను రూ.20కు పెంచడం మంచి నిర్ణయం.

– రాజేంద్రప్రసాద్, డీజీఎం (పర్సనల్)

మా చొరవతోనే పెంపు



యాజమాన్యం, కార్మికుల భాగస్వామ్యంతో పాటు ప్రతీ టన్నుకు రూ.10 చొప్పున సెస్ జమ చేస్తున్నా కార్మికుల పెన్షన్‌కు సరిపోవడం లేదు. దీన్ని ఎవరూ పట్టించుకోకున్నా మేం రూ.30కి పెంచాలని ప్రతిపాదిస్తే రూ.20కు పెంచారు.

– పి.మాధవనాయక్, బీఎంఎస్ నాయకుడు